AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.
4-11-2025 (Tuesday) MAIN EDITION

## డ్యుయల్ డిస్‌ప్లేతో సరికొత్త ఫోన్..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్స్ తయారీ కంపెనీ అయిన షావోమీ.. ప్రీమియం సెగ్మెంట్‌లో ఇటీవల చైనాలో నూతన మోడళ్లను లాంచ్ చేసింది. షావోమీ 17, షావోమీ 17 ప్రో, షావోమీ 17 ప్రో మాక్స్ వేరియంట్స్ లాంచ్ అయ్యాయి. వీటిని త్వరలో భారత మార్కెట్‌లోనూ విడుదల చేయడానికి ఆ సంస్థ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో షావోమీ 17 ప్రో మాక్స్ 7500 ఎంఏహెచ్ బ్యాటరీ, 100 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్, డ్యూయల్ స్క్రీన్స్ వంటి అద్భుత ఫీచర్లతో రానుంది.

## ఆ సొమ్ము దోచుకోలేరు: అమిత్ షా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బిహార్‌లో జంగిల్‌రాజ్ (ఆటవిక పాలన) తిరిగి రావద్దంటే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని కేంద్రమంత్రి అమిత్ షా బిహార్ ఓటర్లను కోరారు. దర్భాంగాలో ఎన్నికల ప్రచారంలో అమిత్‌షా మాట్లాడారు. ఇటీవల బిహార్ ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిన రూ.10వేలను ఉపసంహరించుకోవాలని ఆర్జేడీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని తప్పుబట్టారు. ఆ సొమ్మును ఆర్జేడీ నేతలు దోచుకోవాలని చూస్తున్నారంటూ ధ్వజమెత్తారు. లాలూ తాతలు దిగొచ్చినా.. ఆ సొమ్మును దోచుకోలేరన్నారు.

## కరెంట్ షాక్‌తో హోంగార్డు మృతి



అక్షరటుడే, వికారాబాద్: విద్యుత్ షాక్‌తో ఓ హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో చోటు చేసుకుంది. చేవెళ్ల మండలం కౌకుంట్లకు చెందిన శ్రీనివాస్ ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసు వాహనాలను శుభ్రం చేస్తున్న క్రమంలో కరెంట్ షాక్ కొట్టింది. దీంతో ఆయన మృతి చెందాడు.

## ఆక్రమణలు కూల్చివేసిన హైడ్రా




అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: హైడ్రా అధికారులు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. మేడ్చల్-తూంకుంట పరిధిలోని దేవరయాంజల్‌లో కూల్చివేతలు చేపట్టారు. నాలాపై ప్రహరీ నిర్మించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమణలు నిజమేనని తేలడంతో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు.

## నెక్స్ట్ సూపర్ పవర్‌గా భారత్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్‌పై ప్రశంసలు కురిపించారు. అమెరికా, చైనాలతో పాటు ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్ నిలవనుందన్నారు. ఇదే క్రమంలో ప్రపంచశక్తిగా ఎదుగుతోన్న భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించకపోవడాన్ని తప్పుబట్టారు.

## విశాఖలో కంపించిన భూమి..




**అక్షరటుడే, విశాఖపట్నం:** విశాఖపట్నం నగరంలో తెల్లవారు జామున స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారు జామున కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మాధవధార, అక్కయ్యపాలెం, హెచ్‌బీ కాలనీ, అల్లాపురం, ఎండాడ, భీమిలి, పెందుర్తి వంటి ప్రాంతాల్లో ప్రజలు తమ ఇళ్లు స్వల్పంగా ఊగుతున్నట్లు గమనించారు. భీమిలి బీచ్ రోడ్డు పరిసరాల్లో పెద్ద శబ్దం వినిపించడంతో, ప్రజలు బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో పెందుర్తి, సింహాచలం, ఎండాడ ప్రాంతాల్లో కూడా ఈ ప్రకంపనలు వచ్చాయి.

## అత్యాచారం కేసు నిందితులపై పోలీసుల కాల్పులు!

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళనాడులో కామాంధులు బరి తెగించారు. కోయంబత్తూరులోని ఓ కళాశాల విద్యార్థినిని ముగ్గురు కీచకులు కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేసిన విచారణ చేపట్టారు. నిందితులు వెల్లకినారులోని ఓ ఆలయం వద్ద దాక్కున్నారనే సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. పోలింగ్‌కు మరో వారం రోజులే గడువు ఉండడంతో ప్రచారం జోరందుకుంది. ఉప సమరంలో గెలుపు బావుట ఎగుర వేయాలని మూడు ప్రధాన పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యాయి. వాస్తవానికి ఒక నియోజకవర్గానికి సంబంధించిన ఉప ఎన్నిక అయినప్పటికీ ఏ పార్టీ కూడా తేలిగ్గా తీసుకోవడం లేదు. స్థానిక పోరుకు ముందు జరిగే ఎన్నికలో గెలిస్తే కలిసి వస్తుందని భావిస్తున్న పార్టీలు.. గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తున్నాయి.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




# మరో వారం రోజులే..

- రసవత్తరంగా జూబ్లీహిల్స్ పోరు
- సర్వశక్తులూ ఒడ్డుతున్న ప్రధాన పార్టీలు
- ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు
- వ్యూహ, ప్రతివ్యూహాల్లో మూడు పార్టీలు నిమగ్నం
- విజయంపై కన్నేసిన అధికార కాంగ్రెస్
- సిట్టింగ్ సీటు కాపాడుకునే తాపత్రాయంలో బీఆర్ఎస్
- సిటీలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్న బీజేపీ
- పేదల బస్తీలు, కాలనీలపైనే ఫోకస్

స్థానిక సమరానికి ముందు జరుగుతున్న ఈ ఉప ఎన్నిక రాజకీయంగా ఎంతో కీలకం కావడంతో మూడు పార్టీలు తమ శక్తినంతా కూడదీసుకుని హోరాహోరీగా పోరాడుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌లో గెలిచి తమ బలాన్ని మరింత పెంచుకోవాలని యోచిస్తుండగా, సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడం ద్వారా తమకు ఆదరణ తగ్గలేదని నిరూపించేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకుని సత్తా చాటాలని బీజేపీ శ్రమిస్తోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీలు, పేదలు, సినీ కార్మికులే కీలకం కానున్నారు. నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల ఓటర్లు ఉండగా, మెజార్టీ ఓట్లు ఆయా వర్గాలకు చెందినవే కావడం గమనార్హం. సంపన్నులు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నప్పటికీ వారు లైనులో నిలబడి ఓటు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపరు. ఫలితంగా ప్రతి ఎన్నికలో జూబ్లీహిల్స్‌లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతుంది. గతంలో జరిగిన నాలుగు ఎన్నికల్లో సగటున 50 శాతం ఓటింగ్ కూడా నమోదు కాలేదంటే ఇక్కడి ఓటర్ల వ్యవహార శైలి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పేదలు, మైనార్టీ వర్గాల ఓట్లు ఎక్కువగా ఉన్న తరుణంలో మూడు పార్టీలు వారిపైనే ఫోకస్ చేశాయి. ఆయా వర్గాలను మచ్చిక చేసుకోవడంపై దృష్టి సారించాయి.

### ముస్లిం ఓట్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కన్ను..

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా మైనార్టీలు, సినీ కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే మజ్లిస్ మద్దతు కూడగట్టిన అధికార పార్టీ.. మరోవైపు, మైనార్టీ వర్గానికి చెందిన సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టడంతో ముస్లింలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేసింది. ఇక, బీఆర్ఎస్ కూడా మైనార్టీ వర్గాలనే ప్రధానంగా నమ్ముకుంది. రెండు, మూడు డివిజన్లలో ఎక్కువగా ఉన్న ముస్లిం వర్గాలను మచ్చిక చేసుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే పలువురు మైనార్టీ నేతలను పార్టీలోకి చేర్చుకుంది. ఎర్రగడ్డ, షేక్‌పేట్, రహమత్‌నగర్, బోరబండ వంటి కీలక ప్రాంతాల్లో బలం పెంచుకునే పనిలో పడింది. ఇక్కడి ఓటర్లే గెలుపుఓటములు నిర్ణయించనున్న తరుణంలో వారిని మచ్చిక చేసుకోవడంపై దృష్టి పెట్టింది. అలాగే, బస్తీల్లోని పేద వర్గాలకు దగ్గర కావడానికి ప్రయత్నిస్తోంది. మరోవైపు, రెండు పార్టీల కంటే కాస్త వెనుబడినట్లు కనిపిస్తున్న బీజేపీ కూడా రెండు, మూడు రోజులుగా ప్రచారాన్ని ఉధృతం చేసింది. పార్టీ నేతలు సభలు, సమావేశాలు కాకుండా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

### బలమైన సామాజికవర్గాలపై దృష్టి..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొన్ని బలమైన సామాజిక వర్గాలు ఉన్నాయి. ప్రధానంగా యాదవ, మున్నూరుకాపు, గౌడ కులస్తుల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. దీంతో ఆయా వర్గాల ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలని యోచిస్తున్న పార్టీలు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయా సామాజిక వర్గాల నేతలను పిలిపించి ప్రచారం చేయిస్తున్నాయి. కుల సంఘాల నాయకులను గల్లీగల్లీలో తిప్పుతున్నాయి. వెంగళ్‌రావ్‌నగర్, సోమాజీగూడ, రహమత్‌నగర్, బోరబండ వంటి ప్రాంతాల్లో నిర్ణయాత్మక ఓట్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి..: సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్‌ను ఇన్నొవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడంలో తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి జర్మనీకి చెందిన ప్రతినిధి బృందాన్ని కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందన్నారు. ప్రధానంగా ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీల పెట్టుబడులు పెట్టాలని కోరారు. జర్మనీ కాన్సులేట్ జనరల్ (చెన్నై) కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం సీఎంతో భేటీ అయింది.

## వైద్య ఆరోగ్య శాఖలో భారీగా ప్రమోషన్లు



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్యారోగ్య శాఖలో భారీగా ప్రమోషన్లు కల్పించింది. ముగ్గురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా, 36 మందికి సివిల్ సర్జన్ వైద్యులుగా పదోన్నతి కల్పించింది. వైద్యారోగ్య శాఖలో కొంతకాలంగా పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రమోషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి, శ్వేత మొంగా, మంజునాథ్ నాయక్‌కు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి ఇచ్చింది. కృష్ణవేణిని హైదరాబాద్ డీఎంఈ జాయింట్ డైరెక్టర్‌గా, శ్వేతను మెడికల్ హెల్త్ సర్వీసెస్ బోర్డు జాయింట్ డైరెక్టర్‌గా, మంజునాథ్ నాయక్‌ను నేషనల్ హెల్త్ మిషన్ సీఐవోగా నియమించింది. కాగా.. ప్రభుత్వం గతంలో డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించింది. 36 మందికి సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ ఇచ్చింది. తాజాగా వారికి పోస్టింగ్ ఇచ్చింది.



## ఆర్కియాలజిస్ట్ దక్షగా మీనాక్షి

**అక్కినేని యంగ్ హీరో నాగచైతన్య ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఓ థ్రిల్లర్ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు వర్కింగ్ టైటిల్‌గా 'NC24' అని నిర్ణయించారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నాగచైతన్య ఇప్పటివరకూ కనిపించని ఒక కొత్త యాంగిల్‌లో కనిపించనున్నాడు. డివోషనల్ టచ్ ఉన్న థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, స్పెషల్ వీడియోలు భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. 'NC24'లో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం ఆమె లుక్‌ను రివీల్ చేసింది. ఈ సినిమాలో మీనాక్షి 'దక్ష' అనే ఆర్కియాలజిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. ఈ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.**


**– అక్షరటుడే, సినిమా డెస్క్**

## 6 నుంచి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ విచారణ



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఎటూ తేలడం లేదు. స్పీకర్ కార్యాలయం విచారణ ప్రక్రియలో జాప్యం చేస్తుండమే ఇందుకు కారణమని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ నెల 6వ తేదీ నుంచి రెండో విడత విచారణ చేపట్టనున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పీకర్‌కు సూచించిన విషయం తెలిసిందే. అయితే నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయింది. అక్టోబర్ 31తో సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసింది. అందరి విచారణ పూర్తికాకపోవడంతో మరో రెండు నెలలు గడువు కావాలని ఇటీవల స్పీకర్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా ఈ నెల 6 నుంచి ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై రెండో విడత విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## గచ్చిబౌలిలో డ్రగ్స్ పార్టీ భగ్నం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ దందా జోరుగా సాగుతోంది. చాలా మంది యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. నగరంలో యథేచ్ఛగా డ్రగ్స్ విక్రయాలు సాగుతున్నాయి. ఈగల్ టీం, ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేపట్టి భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకుంటున్నారు. అయినా కూడా దందా ఆగడం లేదు. నగరంలో కొందరు బడాబాబులు, ప్రముఖుల కోసం ఇటీవల కాలంలో డ్రగ్స్, రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నారు. తాజాగా గచ్చిబౌలిలో డ్రగ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. కోలివింగ్ గెస్ట్ రూంలో కొందరు డ్రగ్ పార్టీ నిర్వహిస్తుండగా.. ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. డ్రగ్స్ పార్టీని భగ్నం చేసిన పోలీసులు మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. కర్ణాటక నుంచి తెచ్చి హైదరాబాద్‌లోని యువకులకు డ్రగ్స్ విక్రయిస్తున్న స్మగ్లర్ గుత్తా తేజకృష్ణతో పాటు మరో నైజీరియన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ పార్టీలో ఎండీఎంఏతో పాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.